సాక్షి రంగారెడ్డి

గురువారం । 4 । మే । 2023



రెగ్యులరైజ్ చేయాలి

పంచాయతీ జూనియర్ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. 8లో▸

ప్రత్యేక రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: వేసవి రద్దీ దృష్ట్యా కాచిగూడ-జికనూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ తెలిపారు. ఈ నెల 6 నుంచి వచ్చే నెల 24 వరకు ప్రతి శని వారం రాత్రి 9.30 గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 1.50 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 9 నుంచి వచ్చే నెల 27 వరకు ప్రతి మంగళవారం రాత్రి 8.15కు బయలుదేరి గురువారం ఉదయం 9.40 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది.

'పట్నం'లో ట్రాఫిక్ ఠాణా

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. త్వరితగతిన ఈ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య నివారణకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు

మొయినాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బంది చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. మొయినాబాద్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఇప్పించేలా కృషి చేయాలన్నారు. ఆరోగ్య విషయాలు, వైద్య సేవలపై గర్భిణులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు అవసరమైన అన్ని మందులను సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్, వివిధ మండలాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి ఉచిత శిక్షణ శిబిరం

షాద్‌నగర్‌రూరల్: వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులకు పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల ఆవరణ (గాంధీనగర్ కాలనీ)లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని(సృజనోత్సవం) నిర్వహిస్తున్నట్లు జేవీవీ డివిజన్ అధ్యక్షుడు కుర్మయ్య, కార్యదర్శి రజాక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అంశాల్లో విద్యార్థులకు ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. సరదా సరదా గణితం, జీవశాస్త్రం, భౌతికశాస్త్రం, మ్యాజిక్, చిత్రలేఖనం, చెస్, యోగా తదితర అంశాలపై ప్రావీణ్యం కలిగిన ఉపాధ్యాయులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. చివరి రోజు శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని వివరించారు. వివరాలకు 94906 54268, 93964 72969 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాలిక కిడ్నాప్ కథ ఆరు గంటల్లో సుఖాంతం

పహాడీషరీఫ్: కిడ్నాప్‌నకు గురైన బాలిక ఆచూకీని పోలీసులు ఆరు గంటల్లోనే గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్‌కు చెందిన బాలిక (14) మంగళవారం రాత్రి 9.30 గంటల సమయంలో సబ్బు కొనుగోలు చేసేందుకు కిరాణ దుకాణానికి వెళ్లి కిడ్నాప్‌నకు గురైంది. ప్రాథమిక అనుమానాలతో నిందితుడి ఫోన్ నంబర్ ఆధారంగా పోలీసులు నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి టోల్‌ప్లాజా సమీపంలో బుధవారం వేకువజామున మహారాష్ట్రకు వెళ్తున్న నాగపూర్ బస్సులో గుర్తించి బాలికను రక్షించారు. మహేశ్వరం డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, ఏసీపీ అంజయ్య సమక్షంలో బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

బ్యాంకు లింకేజీ లక్ష్యాన్ని పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావు

చేవెళ్ల: మహిళా సంఘాలకు అందిస్తున్న బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం డివిజన్ స్థాయి అధికారులతో జేఎంఎల్‌బీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల శాఖల వారీగా బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళా సంఘాలకు అందించే బ్యాంకు లింకేజీ రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి చెల్లింపులు జరిగేలా చూసుకోవాలన్నారు. గతంలో డివిజన్‌లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన రుణాల్లో చేవెళ్లలో 30, శంకర్‌పల్లిలో 5, మొయినాబాద్‌లో 8, షాబాద్‌లో 13 చొప్పున రుణాలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే ఇవ్వాలని సూచించారు. బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎంజీవై, పీఎంఎస్‌జీవై బీమా సౌకర్యాలు ప్రజలు ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో చేవెళ్ల, షాబాద్ ఎంపీడీఓలు రాజ్‌కుమార్, అనురాధ, ఏడీఏ రమాదేవి, ఏపీఎంలు శోభారాణి, రవీందర్, ఆయా మండలాల అధికారులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

రైతుబంధు పక్కదారి



మొయినాబాద్ మండలంలోని ఓ ఫాంహౌస్

నగరానికి చెందిన ఓ వ్యక్తి మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి రెవెన్యూలో ఎకరం భూమి కొనుగోలు చేశాడు. అందులో ఓ బిల్డింగ్‌తోపాటు స్విమ్మింగ్ పూల్, పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు ఏర్పాటు చేశాడు. చుట్టూ పచ్చని చెట్లు, పచ్చని గడ్డితో లాన్ ఏర్పాటు చేశాడు. అందమైన ఫాంహౌస్‌గా తీర్చిదిద్ది అద్దెకిస్తూ నెలకు రూ.లక్షలు గడిస్తున్నాడు. రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమి వ్యవసాయ భూమిగా నమోదై ఉండటంతో ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి సాయం ప్రతి ఆరునెలలకోసారి అతని ఖాతాలో జమవుతోంది.

మొయినాబాద్ మండలానికి చెందిన ఓ నాయకుడు తన వ్యవసాయ పొలంలో ఫాంహౌస్ నిర్మించి ఇతరులకు లీజుకు ఇచ్చాడు. దీంతో అతనికి నెలకు రూ.50 వేలు ఆదాయం వస్తోంది. పంటలు సాగుచేయకుండా ఫాంహౌస్ నిర్మించిన భూమికి సైతం రైతుబంధు డబ్బులు పెట్టుబడి సాయం కింద అందుతున్నాయి. జిల్లాలో వ్యవసాయేతర కార్యకలాపాలు నిర్వహించే వేల ఎకరాలకు ఇలా ప్రభుత్వం ఇచ్చే రైతుబంధు వెళ్తోంది.

ఫాంహౌస్‌లకు పెట్టుబడి సాయం

- ఒకవైపు ప్రైవేటు కార్యకలాపాలు
- మరోవైపు ప్రభుత్వ ప్రోత్సాహకం
- నగర శివారుల్లో కొనసాగుతున్న తంతు

మొయినాబాద్: రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2018 మే 10న రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టింది. పంట పెట్టుబడి సాయం పేరుతో వ్యవసాయం చేసే ప్రతి రైతుకు ఎకరాకు ఏడాదికి రూ.8 వేల చొప్పున అందిస్తామని ప్రకటించి మొదటి విడతలో రైతుల పేరుతో చెక్కులు పంపిణీ చేసింది. ఆ తరువాత రైతుల బ్యాంకు ఖాతా నంబర్లు సేకరించి నేరుగా ఖాతాల్లో జమచేయడం మొదలు పెట్టింది. 2019 నుంచి పెట్టుబడి సాయాన్ని ఎకరాకు ఏడాదికి రూ.10వేలకు పెంచింది. అప్పటి నుంచి వానాకాలం, యాసంగి పంటలకు ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమచేస్తూ వస్తోంది.

రికార్డుల్లో వ్యవసాయ భూమి.. క్షేత్రస్థాయిలో ఫాంహౌస్‌లు..

పంట పెట్టుబడి సాయం పేరుతో ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు డబ్బులు పక్కదారి పడుతున్నాయి. నగర శివారు ప్రాంతాల్లో ఇటీవల ఫాంహౌస్‌లు విపరీతంగా పెరిగాయి. ఇవి ఏర్పాటు చేసిన భూములన్నీ రెవెన్యూ రికార్డుల్లో వ్యవసాయ భూములుగానే నమోదవుతున్నాయి. దీంతో వాటన్నింటికీ రైతుబంధు జమ అవుతోంది. వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే యజమానులు కూడా భూములను కమర్షియల్‌గా వాడుకుంటూ రైతుబంధు డబ్బులను తీసుకుంటున్నారు. జిల్లాలో వ్యాపార కార్యకలాపాలు కొనసాగించే భూములు వేల ఎకరాలు ఉన్నాయి. వాటన్నింటికీ రైతు బంధు ఇస్తుండడంతో ఏటా కోట్ల రూపాయలు అనర్హుల ఖాతాల్లోకి వెళ్తున్నాయి.

గుర్తించని అధికారులు..

వ్యవసాయేతర కార్యకలాపాలు జరిగే వ్యవసాయ భూములను గుర్తించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు వాడే భూములను నాలా కింద మార్చాల్సి ఉంటుంది. చాలామంది నాలా కన్వర్షన్ చేయకుండానే వ్యవసాయ భూములను వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు.

ప్రభుత్వం దృష్టి సారించాలి



వ్యవసాయం చేసే రైతులకే ప్రభుత్వం రైతుబంధు ఇవ్వాలి. ఫాంహౌస్‌లు నిర్మించి వాటిలో కమర్షియల్ యాక్టివిటీస్ నిర్వహిస్తూ డబ్బులు సంపాదించే భూ యజమానులకు కూడా ఇస్తోంది. దీంతో నిజమైన రైతులకు లబ్ధి చేకూరడం లేదు. ప్రభుత్వం, అధికారులు దీనిపై దృష్టి సారించాలి.

– శ్రీనివాస్, సీపీఐ మండల కార్యదర్శి, మొయినాబాద్

ఉత్తర్వులు రావాలి



గతంలో క్రీడా మైదానాల విషయంలో ప్రభుత్వం రైతుబంధు నిలిపివేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఫాంహౌస్‌ల విషయంలోనూ ఉత్తర్వులు రావాలి. 111 జీవో పరిధిలో నాలా కన్వర్షన్‌కు అవకాశం లేకపోవడంతో ఈ ప్రాంతంలో ఉన్న వ్యవసాయేతర భూములు కూడా రికార్డుల్లో వ్యవసాయ భూములుగానే కొనసాగుతున్నాయి.

– అశోక్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

రెవెన్యూ రికార్డుల ఆధారంగానే..

రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చిన డాటా ఆధారంగానే రైతుబంధు ఇవ్వడం జరుగుతుంది. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న వ్యవసాయ భూములకు సంబంధించిన రైతుల వివరాలను తీసుకుని వాటికి బ్యాంకు ఖాతా నంబర్లు లింకు చేసి రైతుబంధు జమ చేయడం జరుగుతుంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం పట్టాదారు పాసుపుస్తకంలో వ్యసాయ భూమి అని నమోదై ఉన్న అందరికి రైతుబంధు అందుతుంది.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాఘవాచారి

లక్ష్మీదేవిపల్లిని విస్మరించారు

- పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ రాఘవాచారి

షాద్‌నగర్‌రూరల్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా నిర్మిస్తామని చెప్పిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును సీఎం కేసీఆర్ మరిచిపోయారని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ రాఘవాచారి అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో బుధవారం పాలమూరు అధ్యయన వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో షాద్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పూర్తయ్యే వరకు కుర్చీ వేసుకొని అక్కడే కూర్చుంటానని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ నేటి వరకు ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ఏళ్లు గడుస్తున్నా కనీసం పునాది రాళ్లు కూడా పడలేదని విమర్శించారు. కొత్త సచివాలయం ప్రారంభోత్సవంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై నిర్వహించిన సమీక్షలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం గురించి మాట్లాడకుండా ఉదండాపూర్ నుంచి ఎడమ కాలువద్వారా నారాయణపేట, చేవెళ్ల, కుడి కాలువద్వారా షాద్‌నగర్, మునుగోడు వరకు సాగు, తాగు నీరందిస్తామని అన్నారని.. ప్రభుత్వం చేసిన ప్రకటన సాధ్యం కాదన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్‌కు లక్ష్మీదేవిపల్లి 590 ఫీట్ల ఎత్తు ఉంటే షాద్‌నగర్ ప్రాంతం 675 ఫీట్ల ఎత్తులో ఉందన్నారు. ఇంత ఎత్తులో ఉన్న లక్ష్మీదేవిపల్లి, షాద్‌నగర్ ప్రాంతాలకు ఏ విధంగా నీరందిస్తారని ప్రశ్నించారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరుమలయ్య మాట్లాడుతూ.. లక్ష్మీదేవిపల్లి నిర్మాణం నా కలల స్వప్నం, నేను ఒక రైతునే అని చెబుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రాజెక్టు నిర్మాణం గురించి ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక రంగారెడ్డి జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్, కో కన్వీనర్ నర్సింలు, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కన్వీనర్ అర్జునప్ప, ప్రజా సంఘాల నాయకులు సత్యం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దివ్యాంగుల చెస్

- 16 రాష్ట్రాల నుంచి 250 మంది హాజరు

సనత్‌నగర్: బేగంపేట మయూరి మార్గ్‌లోని దేవనార్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్‌లో ఫిడే రేటింగ్ నేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో దివ్యాంగులు ప్రతిభ కనబర్చారు. దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాలకు చెందిన దాదాపు 250 మంది అంధులు పాల్గొన్నారు. వీరిలో ఆరేళ్ల బాలుడి నుంచి 76 ఏళ్ల వయసు వారు ఉన్నారు. ఈ సందర్భంగా దేవనార్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ సాయిబాబాగౌడ్, కో-వ్యవస్థాపకురాలు జ్యోతిగౌడ్‌లు మాట్లాడుతూ ప్రతియేటా దేవనార్ ఫౌండేషన్ వేదికగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి 15 స్థానాల్లో నిలిచిన వారికి సర్టిఫికెట్‌తో పాటు నగదు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చినవారిని అంతర్జాతీయ స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు.

8న నగరానికి ప్రియాంక

సరూర్‌నగర్ స్టేడియంలో నిరుద్యోగ జంగ్ సైరన్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ కుమార్తె ప్రియాంక గాంధీ ఈ నెల 8న నగరానికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఆమెకు ఘనంగా స్వాగతం పలికేందుకు ఆ పార్టీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి. కర్ణాటకలో ఈ నెల 8న సాయంత్రం 5 గంటలకు ఎన్నికల ప్రచారానికి తెరపడనుంది. బళ్లారి నుంచి సాయంత్రం ఆరున్నర గంటలకు ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ప్రియాంక చేరుకోనున్నారు. అటు నుంచి నేరుగా ఎల్బీనగర్ చౌరస్తాకు వస్తారు. తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి పూల మాల వేసి.. నివాళి అర్పించనున్నారు. అటు నుంచి నిరుద్యోగులతో కలిసి ర్యాలీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకోనున్నారు. రాత్రి 8 గంటలకు సరూర్‌నగర్ స్టేడియం వేదికగా నిర్వహించే నిరుద్యోగ జంగ్ సైరన్ సభలో ఆమె పాల్గొంటారు. తెలంగాణలోనూ సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటం, ఇదే సమయంలో ప్రియాంక రాజకీయ సభలకు హాజరవుతుండటంపై సర్వత్రా ఆసక్తిగా మారింది.

గాంధీ భవన్‌లో సన్నాహక సమావేశం..

ప్రతి నియోజకవర్గం నుంచి కనీసం రెండు వేల మంది నిరుద్యోగులను ఈ ర్యాలీకి సమీకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి చెప్పారు. ఈ మేరకు గాంధీ భవన్‌లో జిల్లా ముఖ్య నేతలతో సమావేశమై..ఏర్పాట్లు, జనసమీకరణ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ.. రాష్ట్రంలో 30 లక్షల మంది పట్టభద్రులు ఉండగా, మూడు లక్షల మంది ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 2.70 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే..కేవలం 26 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి, తీరా పేపర్ లీకేజీ పేరుతో భర్తీ ప్రక్రియను ప్రశ్నార్థకంగా మార్చారని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో మాజీమంత్రి పుష్పలీల, మాజీ ఎమ్మెల్యే వేంరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, వేణుగౌడ్, చిగురింత పారిజాత, దర్శన్, చింపుల సత్యనారాయణరెడ్డి, జయమ్మ, చిలుక మధుసూదన్‌రెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, దండెం రాంరెడ్డి, వై.అమరేందర్‌రెడ్డి, గజ్జి భాస్కర్, విజయ్ పాల్గొన్నారు.

అక్రమ బిల్లుల దందా!

- జిల్లా వికలాంగుల సంక్షేమశాఖలో తంతు
- కోవిడ్ సమయంలో ఖర్చు చేసినట్లు తప్పుడు రికార్డులు
- అంతర్గత విచారణ..ఓ చిరుద్యోగిపై వేటు..నిలిచిన చెల్లింపులు
- తాజాగా అదే బిల్లులకు సంబంధించిన ఫైలుకు మళ్లీ కదలిక..

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖలో అక్రమ బిల్లుల దందా కొనసాగుతోంది. వసతి గృహాల వార్డెన్లు, జిల్లా అధికారులు కుమ్మక్కై..ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టేందుకు యత్నిస్తున్నారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో గతంలో నిలిపివేసిన బిల్లులను ప్రభుత్వం నుంచి గుట్టుగా డ్రా చేసేందుకు మళ్లీ యత్నిస్తుండటంపై విమర్శలు ఉన్నాయి. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మన్సూరాబాద్, చైతన్యపురి, మూసారంబాగ్, సాగర్‌రోడ్డు, చంపాపేటలలో మొత్త ఆరు వసతి గృహాలను ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి వివిధ కాలేజీల్లో, వివిధ కోర్సులు చదువుతున్న దివ్యాంగులతో పాటు చదువు పూర్తయిన..ఉపాధి అవకాశాలు రాక నిరుద్యోగంతో బాధపడుతున్న దివ్యాంగులు, కుంటుంబ సభ్యుల నిరాధరణకు గురైన ఒంటరి దివ్యాంగులు వీటిలో వసతి పొందుతుంటారు.

డైరెక్టరేట్‌కు ఆ ప్రొసీడింగ్స్

ప్రభుత్వం వీరికి ఎప్పటికప్పుడు మెస్ చార్జీలతో పాటు కాస్మొటిక్ చార్జీలను అందజేస్తుంది. కోవిడ్ కారణంగా 2021 ఏప్రిల్ నుంచి 2022 ఫిబ్రవరి వరకు ఆయా వసతి గృహాల్లోని మెజార్టీ దివ్యాంగులు సొంతూళ్లకు వెళ్లిపోయారు. వార్డెన్లు మాత్రం ఆయా హాస్టళ్లలో దివ్యాంగులు ఉన్నట్లు తప్పుడు రికార్డులు సృష్టించారు. వారికి భోజనం, ఇతర అవసరాల కోసం రూ.22,19,600 ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఈ అంశం అప్పట్లో బయటికి పొక్కడం, పలు పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో అప్పటికే కలెక్టర్ అమయ్‌కుమార్ అంతర్గత విచారణకు ఆదేశించారు. ఓ చిరుద్యోగిపై వేటు కూడా వేశారు. అంతే కాదు బిల్లుల చెల్లింపును కూడా నిలిపివేశారు. ఏడాదిన్నర కాలంగా సైలెంట్‌గా ఉన్న సదరుశాఖ అధికారులు మళ్లీ ఈ బిల్లుల చెల్లింపు ఫైలును ముందుకు కదిలించారు. ఏప్రిల్ 15న ఎల్ఆర్ నంబర్ 576/ ఏ/2023న డైరెక్టరేట్‌కు బిల్లు ప్రొసీడింగ్స్ పంపడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే విచారణలో అక్రమమని నిర్ధారించిన బిల్లు ఫైలును ఏడాదిన్నర తర్వాత గుట్టుగా మళ్లీ కదపడం వెనుక ఆంతర్యం ఏమిటో ఆశాఖ ఉన్నతాధికారులకే తెలియాలి. ఇదిలా ఉంటే ఇదే అంశంపై జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ అధికారిణి మోతిని 'సాక్షి' ప్రతినిధి ఫోన్‌లో వివరణ కోరగా ఇప్పటి వరకు అలాంటి బిల్లులేవీ పంపలేదని స్పష్టం చేయడం గమనార్హం.

బాధితుల కోసం గాలింపు!

సాక్షి, సిటీబ్యూరో: సాధారణంగా పోలీసులు తాము దర్యాప్తు చేస్తున్న కేసులకు సంబంధించి నిందితుల కోసం గాలిస్తుంటారు. కృషి బ్యాంక్ కుంభకోణం అంశంలో మాత్రం ఆసక్తికర కోణం చోటుచేసుకుంది. కేసుకు దర్యాప్తు సంస్థగా ఉన్న సీఐడీ ప్రస్తుతం బాధితుల కోసం గాలిస్తోంది. ఓ దర్యాప్తు సంస్థ ఈ తరహా చర్యలు తీసుకోవడం ఇదే తొలిసారి. ఇతర ఏ బ్యాంకుల్లోనూ లేని విధంగా 16.5 శాతం వడ్డీ ఆశ చూపిన కృషి బ్యాంక్ భారీ మొత్తం డిపాజిట్లుగా తీసుకుంది. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించలేని పరిస్థితికి చేరుకున్న బ్యాంక్ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు బోర్డు తిప్పేసి విదేశాలకు పారిపోయారు. 2001 ఆగస్టు 18న ఈ కుంభకోణంపై హైదరాబాద్‌లోని నార్త్‌జోన్‌లో ఉన్న మహంకాళి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు నిమిత్తం సీఐడీకి బదిలీ చేయడంతో ఆ అధికారులు రంగంలోకి దిగారు. వెంకటేశ్వరరావు సహా మరికొందరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు భారీగా ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు. లిక్విడేటర్ సాయంతో వీటిని విక్రయించగా వచ్చిన సొమ్మును బ్యాంకులో డిపాజిట్ చేశారు. బాధితులను గుర్తిస్తూ వారు కోల్పోయిన మొత్తాన్ని చెక్కుల రూపంలో ఇస్తున్నారు. ఇప్పటి వరకు తొమ్మిది విడతల్లో జరిగిన చెక్కుల పంపిణీ ద్వారా రూ.13.14 కోట్లు 700 మంది బాధితులకు అందించారు.

- అప్పట్లో కృషి బ్యాంక్ డిపాజిట్‌దారులుగా ఉన్న వారిలో 173 మంది డబ్బు తీసుకోవడానికి రాలేదు. ఈ మొత్తం లిక్విడేటర్ అధీనంలోనే ఉండిపోయాయి. ప్రస్తుతం సీఐడీ చీఫ్‌గా ఉన్న మహేష్ భగవత్ వీరి ఆచూకీ కనిపెట్టి చెక్కులు అందించాలని నిర్ణయించుకున్నారు. దీనికోసం సీఐడీలో ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వివిధ కోణాల్లో ప్రయత్నించిన ఈ స్పెషల్ టీమ్ 75 మంది ఆచూకీ కనిపెట్టి వారిని సంప్రదించింది.
- డిపాజిట్లకు సంబంధించిన పత్రాలు సమర్పించిన 31 మందికి రూ.8,05,919 చెల్లించాలని లిక్విడేటర్ నిర్ణయించారు. వీరిలో 23 మంది డిపాజిటర్లు బుధవారం నాంపల్లి కోర్టులో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ మహేష్ భగవత్‌తో పాటు లిక్విడేటర్ బి.రాణి, లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, సెషన్స్ జడ్జి ప్రేమావతి చేతుల మీదుగా రూ.6,83,042కు సంబంధించిన చెక్కులు అందించారు. మిగిలిన వారి నుంచి మరికొన్ని డాక్యుమెంట్లు సేకరించాల్సి ఉండటంతో వారికి త్వరలో చెల్లించనున్నారు. మరో 98 మంది ఆచూకీ కనిపెట్టాల్సి ఉందని, దాని కోసం ప్రత్యే క బృందం పని చేస్తోందని మహేష్ భగవత్ తెలిపారు.

వార్డు పాలనకు త్వరలో శ్రీకారం

- ఈనెలాఖరున వార్డు కార్యాలయాలు ప్రారంభం
- వేగంగా పాలనా ఫలాలు అందేలా వికేంద్రీకరణ
- జీహెచ్‌ఎంసీ అధికారులతో మంత్రి కేటీఆర్



సమావేశంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్, ఇతర అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో త్వరలో వార్డుల వారీగా పరిపాలన కార్యకలాపాలు సాగనున్నాయి. ఈ నెలాఖరున జీహెచ్‌ఎంసీ పరిధిలోని 150 వార్డుల్లో వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల సమస్యలను స్థానికంగా అక్కడే పరిష్కరించనున్నారు. బుధవారం కొత్త సచివాలయంలో మంత్రి కేటీఆర్ పురపాలక శాఖపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ అధికారులతో ఆయన మాట్లాడుతూ.. వార్డు పాలనకు సంబంధించి ప్రభుత్వ ఆలోచన, లక్ష్యాలను వివరించారు. ఈ అంశంలో ప్రభుత్వం చేస్తున్న ప్రణాళికలకు ఉన్నతాధికారుల నుంచి కావాల్సిన వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మంచి పాలన అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన తెలంగాణలో సీఎం ఆధ్వర్యంలో పరిపాలనను వికేంద్రీకరించి కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలను ఏర్పాటు చేసినట్లు ప్రస్తావించారు. వాటితోపాటు కొత్త పురపాలికలు, గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పరిపాలన ఫలాలు అందేలా చేయడంలో విజయం సాధించామన్నారు. ఈ దిశగా సీఎం ఆలోచనను ముందుకు తీసుకువెళ్లడంలో భాగంగా హైదరాబాద్‌లోనూ పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వార్డు పాలనకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.

ప్రజలకు చేరువగా కార్యాలయాలు..

వార్డుపాలన వ్యవస్థ ద్వారా ప్రజలు ఇప్పటిలా సర్కిల్, జోనల్ కార్యాలయాల దాకా వెళ్లకుండా తమకు దగ్గరగా ఉండే వార్డు కార్యాలయాల్లోనే తమ సమస్యలను ఫిర్యాదు చేయడంతోపాటు ప్రభుత్వానికి తగిన సలహాలు కూడా ఇవ్వవచ్చన్నారు. తద్వారా ప్రభుత్వం సత్వరం ప్రజల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. ప్రభుత్వ పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడమే ఈ నూతన విధానం లక్ష్యమన్నారు.

ఇన్‌చార్జిగా ఏఎంసీ స్థాయి అధికారి..

వార్డు కార్యాలయానికి ఇన్‌చార్జిగా అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసీ)స్థాయి అధికారి ఉంటారని, ఆయనతో పాటు పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, రోడ్ల నిర్వహణ, ఎంటమాలజీ, వెటర్నరీ, టౌన్ ప్లానింగ్, వాటర్‌బోర్డు వంటి తదితర కీలకమైన విభాగాలకు సంబంధించిన దాదాపు 10 మంది అధికారులు క్షేత్రస్థాయిలో పని చేస్తారని తెలిపారు. మే నెలాఖరునాటికి ఈ వ్యవస్థకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకటి రెండు వారాల్లో వార్డు కార్యాలయాల్లో ఉండాల్సిన సిబ్బందితో కూడిన బృందాలను సిద్ధం చేయాలని సూచించారు. పని చేసేందుకు వారికి తగిన శిక్షణనివ్వాలన్నారు.

సిటిజెన్ ఫ్రెండ్లీగా..

వార్డు కార్యాలయాలు ఏకరూపంగా ఉండేలా, కార్యాలయాల కోసం సిటిజెన్ ఫ్రెండ్లీ డిజైన్‌ను రూపొందించాలని సూచించారు. వార్డు కార్యాలయాలను సామాజిక మాధ్యమాలతో పాటు ఒక వార్డు కార్యాలయం మరో వార్డు కార్యాలయంతో అనుసంధానమయ్యేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వార్డు పాలన వ్యవస్థ వల్ల పౌర సేవలు వేగంగా అందగలవన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, జలమండలి ఎండీ దానకిశోర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డు వద్ద చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ కథనం మేరకు.. మంచాల మండలం ఆగాపల్లికి చెందిన పీ నవీన్(25) ద్విచక్ర వాహనంపై ఇబ్రహీంపట్నంకు వస్తున్నాడు. అదే మార్గంలో వస్తున్న టాటా ఏస్ వాహనం వెనుక నుంచి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి

- టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్
- కార్యదర్శుల నిరసన ర్యాలీ

చేవెళ్ల: పంచాయతీ జూనియర్ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీ శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో డివిజన్‌లోని కార్యదర్శులతో ర్యాలీ, ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మెలో ఆయన ప్రసంగించారు. జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. అనంతరం ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి ఎం శశిధర్ గౌడ్ మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీ జూనియర్ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్



అంబేడ్కర్, పూలే విగ్రహాలకు వినతిపత్రాలు అందజేస్తున్న కార్యదర్శులు

సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ ఎండీ అశ్వక్ బైగ్, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ మండలాల అధ్యక్షులు జే శివకుమార్, వాసవిరెడ్డి, హరిశంకర్, కే రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫెడరేషన్ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడిగా కే శేఖర్, ఉపాధ్యక్షుడిగా షేక్ అజీమ్, ప్రధాన కార్యదర్శిగా ఏ మహేందర్, కోశాధికారిగా ఎం హరికృష్ణను ఎంపిక చేశారు.

ప్రతిఒక్కరిలో భక్తిభావం ఉండాలి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లి బొడ్రాయి పండుగలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పురాతన కాలం నుంచి గ్రామాల్లో బొడ్రాయి పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, తద్వారా మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, కాంగ్రెస్ నాయకుడు వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్ల దొంగలు అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు
- రూ. 2.80లక్షల విలువ చేసే సామగ్రి స్వాధీనం

మహేశ్వరం: పొలాలు, ఇళ్ల వద్ద నిలిపిన ట్రాక్టర్ నాగళ్లు, గుంటుకలను దొంగిలించే ఆరుగురు సభ్యుల ముఠాను మహేశ్వరం పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ అంజయ్య కథనం మేరకు.. మహేశ్వరం మండలం కోళ్లపడకల్ గ్రామానికి చెందిన ఏ మహేందర్, అమీర్‌పేట్ గ్రామానికి చెందిన కే రాజు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరూ అప్పులు చేసి మద్యం, కల్లు తాగేవారు. తాగుడికి బానిసైన వీరు ట్రాక్టర్ల పరికరాలు నాగళ్లు, గుంటుకలను దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. శంషాబాద్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి సయ్యద్ ఖదీర్, మహ్మద్ యూనస్, మహ్మద్ మహబూబ్ మహ్మద్ అక్బర్ లతో కలసి వ్యవసాయ పనిముట్లు చోరీ చేశారు. పలు గ్రామాల్లో వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్ల పరికరాలు మాయమవుతుండడంతో ఇటీవల రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగళవారం సాయంత్రం మన్సాన్‌పల్లి చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ట్రాలీ ఆటోలో ఇనుక నాగళ్లు, గుంటుకలు తీసుకెళ్తుండగా వాహనాన్ని ఆపి విచారించారు. దీంతో అసలు విషయం బయటపడింది. తామే దొంగతనం చేశామని నిందితులు ఒప్పుకున్నారు. ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 2.80లక్షల విలువ చేసే నాలుగు ట్రాక్టర్ నాగళ్లు, నాలుగు గుంటుకలు, మూడు ట్రాలీ ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసును ఛేదించిన సీఐ మధుసూదన్, ఎస్‌ఐలు నర్సయ్య, సుబ్బారెడ్డిని ఏసీపీ అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వ్యవసాయ పనిముట్లు

ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

- రూ. 9.10లక్షల ముడిసరుకు సీజ్

ఆమనగల్లు: పట్టణంలో అనుమతి లేకుండా పరిశుభ్రత పాటించకుండా ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్న పరిశ్రమపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేశారు. రూ. 9.10 లక్షల విలువైన ఐస్‌క్రీం ముడిసరుకులు, వాహనాలను సీజ్ చేశారు. ఆమనగల్లు ఎస్‌ఐ సుందరయ్య కథనం మేరకు.. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వెనుక ఉన్న ఓ ఇంట్లో మెగా ఐస్‌క్రీమ్ పేరుతో ఐస్‌క్రీంలను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఐస్‌క్రీం తయారీకి అనుమతి లేదు. నాణ్యత పాటించడం లేదు. దీంతో మంగళవారం సాయంత్రం పరిశ్రమలో ఎస్‌ఓటీ పోలీసులు తనిఖీ చేశారు. పరిశ్రమకు ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో యజమాని ఎర్రబిక్య తండాకు చెందిన నేనావత్ సంగ్రియా, నిర్వాహకుడు వడ్త్యావత్ గోపీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనుమతులు లేకుండా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



ఐస్‌క్రీంల తయారీకి వినియోగిస్తున్న అపరిశుభ్ర నీరు

రామచంద్రాపూర్‌లో..

కొందుర్గు: మండలంలోని రామచంద్రాపూర్‌లో అనుమతులు లేని ఐస్‌క్రీం తయారీ పరిశ్రమపై బుధవారం ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేశారు. ఐస్‌క్రీం తయారీలో నాణ్యమైన సరుకులు వాడకపోవడంతో పరిశ్రమను సీజ్ చేశారు.

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు అపహరణ

శంకర్‌పల్లి: గుర్తుతెలియని దుండగులు వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును అపహరించుకెళ్లిన ఘటన బుధవారం శంకర్‌పల్లిలోని సాయికాలనీలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం భానూరుకు చెందిన లక్ష్మి శంకర్‌పల్లిలో బంధువుల తొట్టెల కార్యక్రమంలో పాల్గొనడానికి తన కోడలు సరిత, మనుమడు పవన్‌తో కలిసి వచ్చింది. బస్సు దిగి సాయినగర్‌కు వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై హెల్మెట్ పెట్టుకొని వచ్చి లక్ష్మి మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. కోడలు సరిత, మనుమడు పవన్ దొంగను వెంబడించినా దొరక లేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ రష్మీ పెరుమాళ్, సైబరాబాద్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, నార్సింగ్ ఏసీపీ రమణాగౌడ్, శంకర్‌పల్లి సీఐ ప్రసన్నకుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి, సీసీఎస్ సీఐ నర్సింహా ఘటనా స్థలాన్ని సందర్శించారు. దొంగతనం జరిగిన తీరును తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పుటేజీలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. త్వరలో దొంగను పట్టుకుంటామని పోలీసు అధికారులు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



శంకర్‌పల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వికారాబాద్ రైల్వే ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. శంకర్‌పల్లి రైల్వేస్టేషన్‌లోని టికెట్ బుకింగ్ కౌంటర్ సమీపంలో ఓ వృద్ధుడు(65) మృతి చెందాడు. ఒంటిపై తెలుపు రంగు షర్ట్, బ్లూ కలర్ లుంగీ ఉందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఖాతాదారుల డబ్బు స్వాహాపై విచారణ

యాచారం: తపాలా కార్యాలయంలో ఖాతాదారుల డబ్బు స్వాహాపై బుధవారం హైదరాబాద్ ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారి నర్మద విచారణ చేపట్టారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఖాతాదారులు తపాలా కార్యాలయంలో నెల నెలా జమ చేసే దాదాపు రూ. 30లక్షలకు పైగా యాచారం తపాలా శాఖ అధికారి రహెమాన్ స్వాహా చేశారు. ఖాతాదారుల ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారి నర్మద రికార్డులను తనిఖీ చేశారు. కొంత మంది ఖాతాదారులను, వివిధ గ్రామాలకు చెందిన తపాలా శాఖ సిబ్బందిని విచారించారు. ఖాతాదారులు జమ చేసే డబ్బులను కేవలం పాసు పుస్తకాల్లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంపై అనుమానం వచ్చిన ఖాతాదారులు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టినట్లు నర్మద తెలిపారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలియజేశారు.

బాత్‌రూమ్‌లో కాలుజారి పడి గర్భిణి మృతి



తేజస్విని (ఫైల్)

చేవెళ్ల: స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్లిన ఎనిమిది నెలల గర్భిణీ కాలుజారి కింద పడి మృతి చెందింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండాలలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తిప్పని రాజేందర్‌రెడ్డి, తేజస్విని(29) దంపతులు. ప్రస్తుతం ఆమె 8 నెలల గర్భిణీ. బుధవారం స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్లి కాలు జారి పడిపోయింది. చాలా సేపైనా తేజస్విని బయటకు రాలేదు. కుటుంబసభ్యులు ఎంత పిలిచినా పలుకలేదు. దీంతో తలుపులు పగులగొట్టి చూసే సరికి బాత్‌రూమ్‌లో కింది పడిపోయి కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే కడుపులో ఉన్న బిడ్డతోపాటు ఆమె మృతి చెందినట్లు తెలిపారు.

బస్సుయాత్ర ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ నుంచి విద్యార్థి నిరుద్యోగ భరోసా బస్సు యాత్ర ప్రారంభమైంది. బుధవారం తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘం జేఏసీ కన్వీనర్ మిడతపల్లి విజయ్ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్రను ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు విద్యార్థుల పోరుకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీసీ నేత తుర్క నర్సింహా, శంకర్, రమేష్, రెడ్డి శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీగంధం చెట్లు ఎత్తుకెళ్లే ముఠా అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు

ఇబ్రహీంపట్నం: శ్రీగంధం చెట్లు నరికి దుంగలు ఎత్తుకెళ్లే ఐదుగురు సభ్యుల ముఠాను యాచారం పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు తన కార్యాలయంలో యాచారం సీఐ లింగయ్య కలసి నిందితుల వివరాలు వెల్లడించారు. ఇటీవల యాచారం శివారులోని రవీందర్ తోటలో, అలాగే శ్రీకాంత్‌రెడ్డి పొలం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు శ్రీగంధం చెట్లను నరికి ఎత్తుకెళ్లారు. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బుధవారం మాల్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తూ నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒక వ్యక్తి బావి వద్ద డంప్ చేసిన మూడు శ్రీగంధం దుంగలు, కారు, రెండు బైకులు, రంపం, రెండు గొడ్డళ్లు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. యాచారం గ్రామానికి చెందిన పీ నరేష్(30), కుర్మిద్దకు చెందిన ఎన్ రమేష్(35), ఎన్ శ్రీకాంత్ (32), ఎన్ సురేష్(35), లక్ష్మీగూడ, ఆర్‌జీకే కాలనీ, మైలార్‌దేవర్‌పల్లికి చెందిన షేక్ గులాం సైఫ్(29)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ఉమామహేశ్వరరావు

నార్సింగిలో హరేకృష్ణ హెరిటేజ్ టవర్



నార్సింగి రెవెన్యూలో నిర్మించనున్న దేవాలయం

మణికొండ: ఐటీ, నివాస టవర్లకు కేంద్రమైన నార్సింగిలో హరే కృష్ణ మూవ్‌మెంట్ నిర్వాహకులు హెరిటేజ్ టవర్‌ను నిర్మించనున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో గోల్డన్ టెంపుల్ పేరుతో ఓ దేవాలయం నిర్మించగా ప్రస్తుతం నగర శివారు నార్సింగి రెవెన్యూలోను శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ రాధా కృష్ణల దేవాలయాలను అందులో నిర్మించనున్నారు. శ్రీ కృష్ణ గోశాలకు చెందిన భూమిలో ఈ దేవాలయాన్ని నిర్మించనున్నారు. ఇప్పటికే నార్సింగి కేంద్రంగా భోజనామృత అక్షయ పాత్ర వంట కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం దాని పక్కనే దేవాలయ నిర్మాణానికి నిర్ణయించారు. ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న భూమి పూజకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం కలిసి ఆహ్వానించారు. బుధవారం ముఖ్యమంత్రి తన పర్యటన ఖరారు చేసినట్టు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9.30గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని వారు వివరించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ పి. మహేందర్ రెడ్డిలతో పాటు అధికారులు హాజరవుతారని వారు తెలిపారు. కోకాపేట కేంద్రంగా రాజశ్యామల అమ్మవారి దేవాలయం, నార్సింగి కేంద్రంగా శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీరాధా కృష్ణల దేవాలయాలు రావటంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కుంటలో బాలుడు గల్లంతు

ఘట్‌కేసర్: దుస్తులు ఉతకడానికి తల్లి, అత్తతో వచ్చిన ఓ బాలుడు కుంటలో గల్లంతైన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్‌కు చెందిన పల్లపు సంతోశ్ (12)పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం తల్లి లక్ష్మి, అత్తతో కలిసి కొండాపూర్ మంగలోనికుంటలో దుస్తులు ఉతకడానికి వెళ్లాడు. తల్లి, అత్త దుస్తులు ఉతుకుతుండగా సంతోశ్ తన పెంపుడు కుక్కతో కలిసి కుంటకు మరొక వైపు వెళ్లాడు. వారు దుస్తులు శుభ్రం చేసే పనిలో నిమగ్నం కాగ సంతోశ్ నీటిలోకి దిగాడు. కొద్ది సమయం తర్వాత తల్లి, అత్త చూడగా బాలుడు కనిపించలేదు. కుక్క మాత్రం కుంట ఒడ్డును కూర్చొని ఉంది. చుట్టు పక్కల వెతికినా కనిపించక పోవడంతో స్థానికులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు స్థానిక గజ ఈతగాళ్లు, నగరం నుంచి ఫైర్, రాచకొండ విపత్తు నిర్వహణ బందం, జీహెచ్‌ఎం సిబ్బంది కుంటలో గాలించినా ఆచూకి లభించలేదు. నాయబ్ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఆర్‌ఐ అలేఖ్య, ఎస్సైలు నాగార్జునరెడ్డి, అశోక్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చీకటి కావడంతో గాలింపును నిలిపేశారు. గురువారం ఉదయం 7 గంటలకు తిరిగి గాలింపు ప్రారంభిస్తామన్నారు.



మంగలికుంటలో బాలుడి కోసం గాలిస్తున్న విపత్తు నిర్వాహణ, ఫైర్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది

సికింద్రాబాద్-మేడ్చల్ రూట్‌లో జీఎం తనిఖీలు

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ బుధవారం సికింద్రాబాద్ – మేడ్చల్ మధ్య ఎంఎంటీఎస్ సర్వీసుల్లో తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ శరత్ చంద్రయాన్ తదితర ఉన్నతాధికారులు ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణికులతో మాట్లాడారు. ఎంఎంటీఎస్ సేవలపై అభిప్రాయాలు, సలహాలు, సూచనలను తెలుసుకున్నారు. సికింద్రాబాద్ -మేడ్చల్ మధ్య సర్వీసులను ఇంకా పెంచాలని ప్రయాణికులు జీఎంను కోరారు. సికింద్రాబాద్ నుంచి మల్కాజిగిరి, దయానంద్ నగర్, సఫిల్‌గూడ, రామక్రిష్టాపురం, అమ్ముగూడ, కావల్రీ బ్యారక్స్, అల్వాల్ బొల్లారం, గుండ్లపోచంపల్లి, గౌడవల్లి, మేడ్చల్ స్టేషన్ల మీదుగా జీఎం ప్రయాణించారు. వివిధ స్టేషన్లలో సదుపాయాలను పరిశీలించారు. సికింద్రాబాద్-మేడ్చల్ మధ్య ఇటీవల ఎంఎంటీఎస్ రైళ్లను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

గోనె సంచిలో మృతదేహం

భాగ్యనగర్‌కాలనీ: గోనెసంచిలో ఓ మహిళ మృతదేహాన్ని గుర్తించిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రాజీవ్‌గాంధీ నగర్ మంజీరా పైప్‌లైన్ సమీపంలో గోనె సంచిలో ఓ మహిళను మూటకట్టి పడేసినట్లు గుర్తించిన స్థానికులు వెంటనే కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గోనె సంచిని బయటకు తీసి చూడగా సుమారు 35 సంవత్సరాల వయసు గల మహిళగా గుర్తించారు. మృతురాలి వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవటంతో గుర్తు తెలియని మహిళగా కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.